క్లుప్తంగా

నేత్రపర్వంగా శివలింగాల ఊరేగింపు

బిక్కవోలు: మండలంలోని ఆరికరేవుల గ్రామంలో సోమవారం శివలింగాల ఊరేగింపు నిర్వహించారు. గ్రామంలో కొలువైన శ్రీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అభిషేకాలు, లక్ష బిల్వార్చన నిర్వహించారు. అమ్మవారికి మహిళలు సామూహిక కుంకుమార్చన చేపట్టారు. ముందుగా ఏర్పాటు చేసిన 54 మట్టి శివలింగాలతో ఊరేగింపు చేపట్టారు. ముందుగా ఆలయం వద్ద నుంచి వీటిని శివస్వాములు తీసుకువచ్చారు. అనంతరం మహిళలు శివలింగాలతో గ్రామంలో కలియతిరిగారు. గణపతి వేషధారణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా కార్తిక వనసమారాధన



కొంకుదురులో అన్నసమారాధన

బిక్కవోలు: మండలంలోని కొంకుదురు బుడిత మామిడి వద్ద సోమవారం ఘనంగా కార్తిక వనసమారధన నిర్వహించారు. శ్రీ బాలాత్రిపుర సుందరీ సమేత త్రిముఖ లింగేశ్వరస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కొంకుదురు గ్రామానికి చెందిన చిన్నం శేషారెడ్డి, కొవ్వూరి రామకృష్ణారెడ్డి, మల్లిడి గంగిరెడ్డి కుటుంబ సభ్యుల సహకారంతో ఈ వనసమారధన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పడాల వెంకటరామారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భోజనం ప్యాకెట్ల వితరణ

సీతానగరం: చిన కొండేపూడిలోని షిర్డీ సాయి బాబా వసతి మందిరం ఆధ్వర్యంలో జరిగే అన్నదాన కార్యక్రమంలో భాగంగా సోమవారం నిరుపేదలకు దాతల సహకారంతో భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు. దాత నాళం సింహాచలం సహకారంలో సుమారు 150 మంది వీటిని అందించారు. మందిర సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

సమస్యలపై ఎంపీడీవోకు వినతి



ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

సీతానగరం: మండలంలోని పలు సమస్యలపై ఎంపీడీవో భారతికి సోమవారం చీపురుపల్లికి చెందిన గోపిశెట్టి అచ్చారావు ఆధ్వర్యంలో బిళ్లకుర్తి వీరబ్రహ్మం, గోపిశెట్టి విష్ణు చక్రం తదితరులు వినతిపత్రం అందించారు. అనంతరం అచ్చారావు విలేకరులతో మాట్లాడుతూ రాపాక – చినకొండేపూడి రోడ్డులోని చీపురుపల్లి దగ్గరలో సిమెంట్ తూరలు పగిలి రోడ్డుపై పెద్ద రంధ్రాలు ఏర్పడ్డాయన్నారు. వాటి వల్ల వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. చీపురుపల్లి నుంచి చినకొండేపూడి జగనన్న కాలనీలో విద్యుత్ స్తంభాలు ఒరిగి ప్రమాదకరంగా మారాయన్నారు.

ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు

సీతానగరం: ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించేందుకు ప్రభుత్వం ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు నిర్మించిందని నేషనల్ క్వాలిటీ అష్యూరెన్స్ స్టాండర్డ్స్ (ఎన్క్యూఏఎస్) కార్యక్రమ పర్యవేక్షణాధికారి డాక్టర్ డి.నవీన అన్నారు. రఘుదేవపురం –2 ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ (ఏఏఎం)లో అందుతున్న ఆరోగ్య సేవలు, అవసరమైన పరికరాలు, వాటి నిర్వహణను తనిఖీ చేశారు. ఇక్కడ 14 రకాల పరీక్షలు, 105 రకాల మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. వాటి వివరాలను వర్చువల్ విధానంలో ఉన్నతాధికారులకు తెలిపారు. ఎన్క్యూఏఎస్ నుంచి వారం రోజుల్లో రఘుదేవపురం– 2 కేంద్రానికి ధ్రువీకరణ పత్రం వస్తుందన్నారు. కార్యక్రమంలో పీహెచ్సీ వైద్యులు ఏవీకే చైతన్య, ఎస్.రాజు, ఎంపీహెచ్ఈవో వైఎస్ రాయుడు, పీహెచ్ఎన్ ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అభ్యసనా సామర్థ్యాలపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న మానిటరింగ్ అధికారి వెంకట్రామిరెడ్డి

రాజానగరం: ప్రాథమిక స్థాయిలో విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాల పెంపునకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కాకినాడ జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి వెంకట్రామిరెడ్డి సూచించారు. కొండగుంటూరులో వారం రోజుల పాటు జరిగే ఎఫ్ఎల్ఎం శిక్షణ తరగతులను సోమవారం ఆయన ప్రారంభించారు. కె.మహేల కీ రీసోర్స్ పర్సన్గా వ్యవహరించిన ఈ తరగతులకు కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల నుంచి 250 మంది ఉపాధ్యాయులు హాజరయ్యారు.

ముందస్తు పరీక్షలతో మేలు

- క్యాన్సర్ వ్యాధిని అరికట్టేందుకు ఇంటింటి సర్వే
- 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరిపై దృష్టి
- మహిళల్లో వచ్చే గర్భాశయ, రొమ్ము క్యాన్సర్ల గుర్తింపు



సుభద్రంపేటలో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేస్తున్న వైద్యురాలు వేణుశ్రీలక్ష్మి, ఆరోగ్య సిబ్బంది

రంగంపేట: ప్రస్తుతం సమాజంలో చాపకింద నీరులా క్యాన్సర్ వ్యాధి వ్యాపిస్తోంది. ఈ మహమ్మారిని అరికట్టేందుకు ఆరోగ్యశాఖ ప్రత్యేక దృష్టి సారించింది. 'క్యాన్సర్పై విజయం.. స్క్రీనింగ్తో సాధ్యం' కార్యక్రమం పేరిట ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు. ఈ సమాచారాన్ని నిక్షిప్తం చేయడానికి వైద్యారోగ్యశాఖ ప్రత్యేక యాప్ను రూపొందించింది. ఇందుకోసం ఆరోగ్యశాఖ సిబ్బందికి శిక్షణ సైతం ఇచ్చారు. ఇంటింటికీ వెళ్లి నిర్వహిస్తున్న సర్వేను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. గ్రామాల్లో ప్రతి ఇంటికి వెళ్లి 18 సంవత్సరాలు నిండిన వ్యక్తికి పలు రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. జాతీయ కుటుంబ ఆరోగ్యశాఖ సర్వే ప్రకారం క్యాన్సర్ను ఆలస్యంగా గుర్తించడం వల్ల అధిక మరణాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ మహమ్మారిని ఎదుర్కోవాలంటే ముందస్తుగా క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలి. ప్రాథమిక దశలోనే లక్షణాలు గుర్తించడం ద్వారా క్యాన్సర్ బాధితుల మరణాల సంఖ్యను తగ్గించవచ్చని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా మహిళల్లో పలు రకాల క్యాన్సర్లు వచ్చే అవకాశాలు ఉన్నాయని వారికి అవగాహన కల్పించి పరీక్షలు నిర్వహించాలని వైద్యులు చెబుతున్నారు.

స్క్రీనింగ్తో సులభం

ఒక వ్యక్తిలో క్యాన్సర్ కణాలకోసం శోధించడాన్నే క్యాన్సర్ స్క్రీనింగ్ అని పిలుస్తారు. ఆ వ్యక్తిలో క్యాన్సర్ ప్రభావిత లక్షణాలు ఉన్నాయో లేదో ఆరోగ్యశాఖ సిబ్బంది పరిశీలించి క్యాన్సర్ పరీక్షలు నిర్వహిస్తారు. ముందస్తు రోగ నిర్ధారణకు ఈ పరీక్షలు ఉపయోగపడతాయి. ప్రస్తుతం గ్రామాల్లో ఆయుష్మాన్ భారత్ సమగ్ర ఆరోగ్య సంరక్షణ కార్యక్రమంలో భాగంగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు.

ఇంటివద్దకు వెళ్లి అడిగే ప్రశ్నలివే

వ్యక్తిగత వివరాలతో పాటు దీర్ఘకాలిక వ్యాధులు గాని, మరే ఇతర వ్యాధులు గాని ఉన్నాయేమో ఆరా తీస్తారు. గతంలో సంక్రమించిన వ్యాధుల వివరాలను అడిగి తెలుసుకుంటారు. చెడు అలవాట్లపై ఆరా తీస్తారు. మహిళల్లో సంక్రమించే గర్భాశయ క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్ లక్షణాలను సైతం గుర్తిస్తారు.

సర్వే విధానం ఇలా

ప్రతి ఇంటి వద్దకు ఆరోగ్యశాఖ సిబ్బంది వెళ్లి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరి ఆరోగ్య సమస్యలు తెలుసుకుని యాప్ ద్వారా వివరాలు అప్లోడ్ చేస్తారు. దంత సమస్యలు నమోదు చేయడం ద్వారా క్యాన్సర్ దశను ప్రాథమిక అంచనా వేస్తారు. ప్రజలకు క్యాన్సర్ స్క్రీనింగ్పై ముందుగా అవగాహన కల్పిస్తారు.

అపోహలు వద్దు



క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలపై ఎలాంటి అపోహలు వద్దు. స్క్రీనింగ్తో ముందస్తుగా క్యాన్సర్ లక్షణాలను గుర్తించవచ్చు. ఎక్కువగా మహిళలు గర్భాశయ, రొమ్ము క్యాన్సర్లతో బాధ పడుతున్నారు. వారు ఈ పరీక్షలతో సత్ఫలితాలు పొందవచ్చు. ప్రతి ఒక్కరూ సర్వేకు సహకరించి పరీక్షలు చేయించుకోవాలి.

– బి.వేణుశ్రీలక్ష్మి, వైద్యురాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, రంగంపేట.

అక్రమ నిర్మాణంపై నోటీసు



నోటీసు అందజేస్తున్న పంచాయతీ సెక్రటరీ రమేష్ బాబు

మధురపూడి: మండల కేంద్రమైన కోరుకొండలో జరుగుతున్న అక్రమ కట్టడం నిర్మాణాన్ని పంచాయతీరాజ్ శాఖ అధికారులు అడ్డుకుంటున్నారు. లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం రోడ్డులో వ్యాపారి మండవిల్లి సతీష్ భవన నిర్మాణం చేపట్టారు. దీనికి అనుమతులు లేకపోవడంతో ఆయనకు నోటీసు జారీ చేశారు. ఈ తరహా భవన నిర్మాణాలకు రుడా ద్వారా క్రమం మార్గంలో అనుమతులు తీసుకోవాల్సి ఉంది.

ట్రాక్టర్లకు జరిమానా

సీతానగరం: మండలంలోని సీతానగరం – పురుషోత్తపట్నం ఏటిగట్టుపై సింగవరం వద్ద ట్రాక్టర్ల రికార్డులను మోటారు వెహికల్ ఇన్స్పెక్టర్ జి.రామ్నారాయణ సోమవారం తనిఖీ చేశారు. లైసెన్స్ లేని డ్రైవర్లు నడుపుతున్న నాలుగు, ట్యాక్స్ కట్టని రెండు, వివిధ కారణాలో మూడు ట్రాక్టర్లకు జరిమానా వేశారు. ట్యాక్స్ కట్టని రెండు ట్రాక్టర్లలో ఒకదాన్ని స్వాధీనం చేసుకుని, స్థానిక పోలీస్ స్టేషన్లో అప్పగించారు. మిగిలిన ఎనిమిది వాహనాలకు ఆన్లైన్లో జరిమాన కట్టవచ్చని రామ్నారాయణ తెలిపారు.

7 నుంచి సుబ్రహ్మణ్యేశ్వరుని షష్ఠి ఉత్సవాలు



షష్ఠి ఉత్సవాల పోస్టర్ను ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

రాజానగరం: స్థానిక రావుల చెరువు గట్టున కొలువైన వల్లీ దేవసేనా సమేత సంతాన సుబ్రహ్మణ్యేశ్వరుని 98వ షష్ఠి ఉత్సవాలు వచ్చే నెల 7 నుంచి 11 వరకు జరుగనున్నాయి. దీనికి సంబంధించిన పోస్టర్ను ఆలయ కమిటీ సభ్యులు సోమవారం ఆవిష్కరించారు. ఐదు రోజులపాటు జరిగే ఈ ఉత్సవాలలో భక్తులను అలరించే విధంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ, ఉత్సవాల నిర్వహణ కమిటీల సభ్యులు కంకటాల సత్తిపండు, సముద్రాల రాంబాబు, మండవల్లి వెంకన్నబాబు, గ్రంధి నానబ్బులు, కంకటాల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

28న అఖండనామ జపయజ్ఞం

మధురపూడి: కోరుకొండ మండలం బూరుగుపూడిలోని సాయిబాబా ఆలయంలో ఈ నెల 28న బాబా అఖండ నామ జపయజ్ఞం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ నాయకులు కంటే గణపతి అన్నారు. ఈ మేరకు సోమవారం ప్రకటన విడుదల చేశారు. ఆ రోజు 12 గంటల పాటు జపయజ్ఞం జరుగుతుందన్నారు. కార్తిక మాసాన్ని పురస్కరించుకుని ఉదయం నుంచి అభిషేకాలు, పూజలు, అనంతరం అన్న సమారాధన నిర్వహించనున్నట్టు తెలిపారు.

మండల స్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



పోటీల విజేతలతో ఇన్చార్జి హెచ్ఎం సతీష్ బాబు, పీడీలు, ఉపాధ్యాయులు

సీతానగరం: రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా సోమవారం సీతానగరం ప్రభుత్వ హైస్కూల్లో మండల స్థాయి పోటీలు నిర్వహించారు. ఇన్చార్జి ప్రధానోపాధ్యాయుడు కస్నూరి సతీష్బాబు అధ్యక్షతన వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్, పరుగుపందెం, పాటలు తదితర పోటీలు జరిపారు. పీడీలు సింహాద్రి, శంకర్ రావు, ఏడీ ప్రసాద్, శ్రీలక్ష్మి, ఉపాధ్యాయులు ఎంవీవీ ప్రసాద్, రాజేష్, బ్రహ్మజీ, విజయ్ కుమార్, సీఆర్పీలు ప్రసాద్, చంటిబాబు, సంజీవ్ రావు పర్యవేక్షించారు. మండలంలోని వివిధ ఉన్నత పాఠశాలలకు చెందిన 45 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

- రన్నింగ్ బాలుర విభాగంలో ఎ.మధునాగసాయి (సీతానగరం), టి.సూర్య కిరణ్ (వంగలపూడి), జి.హర్షవర్ధన్బాబు(చిన కొండేపూడి), బాలికల విభాగంలో పి.బాలశ్రీదుర్గ (సీతానగరం), ఎం.పాప (సీతానగరం), డి.రమ్య భారతి (వెదుళ్లపల్లి) ప్రతిభ చూపారు.
- పాటల విభాగంలో సీహెచ్ అలేఖ్య (చినకొండేపూడి), బి.మహేశ్వరి (చినకొండేపూడి), జి.సునంద (వెదుళ్లపల్లి) విజేతలుగా నిలిచారు./
- వ్యాసరచనలో సీహెచ్ తనూజ (సీతానగరం), సీహెచ్ మహిమ ప్రభావతి (సీతానగరం), ఎ.సంధ్యన (వెదుళ్లపల్లి) మొదటి మూడు స్థానాల్లో నిలిచారు.
- క్విజ్లో రఘుదేవపురం జిల్లా పరిషత్ హైస్కూల్కు చెందిన కేవీ సాయికిరణ్, టి.హేమవర్ధిని, ఎంబీ కుమార్ విజేతలుగా నిలిచారు.
- వక్తృత్వంలో సాయిసత్యగణేష్ (రఘుదేవపురం), ఎ.హారిక (సీతానగరం), కె.వరుణ్ (రఘుదేవపురం), డిబేట్లో వెదుళ్లపల్లికి చెందిన టి.జాహ్నవి, ఎంఎస్ లలిత విజేతలుగా నిలిచారు. వీరందరూ జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఇన్చార్జి హెచ్ఎం కస్నూరి సతీష్ బాబు తెలిపారు.

శైవక్షేత్రాలకు భక్తుల తాకిడి



అనపర్తి రామలింగేశ్వరస్వామిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే దంపతులు



బూరుగుపూడి వీరేశ్వరస్వామి ఆలయంలో భక్తులు



పందలపాకలో లక్షబిల్వార్చన పూజల్లో పాల్గొన్న భక్తులు

మధురపూడి: కార్తికమాసంలోని చివరి సోమవారం కావడంతో కోరుకొండ మండలంలోని శైవక్షేత్రాలకు భక్తులు పోటెత్తారు. బూరుగుపూడిలోని భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయం కిటకిటలాడింది. ఇక్కడ ఈ నెల 2వ తేదీ నుంచి ఓం నమఃశ్శివాయ అఖండనామ జపయజ్ఞం నిర్వహిస్తున్నారు. ఆలయ ధర్మకర్త క్రొవ్విడి సర్రాజు ఆధ్వర్యంలో అర్చకుడు మానేపల్లి సుబ్బారావు స్వామివారికి పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

29న అన్నసమారాధన

వీరేశ్వరస్వామి ఆలయం వద్ద ఈ నెల 29న భారీ అన్నసమారాధన నిర్వహించనున్నట్టు ఆలయ ధర్మకర్త క్రొవ్విడి సర్రాజు తెలిపారు. ముందుగా స్వామికి లక్ష బిల్వార్చన, ఏకాదశ రుద్రాభిషేకం, సహస్ర జ్యోతిర్లింగార్చన జరుగుతుందన్నారు.

గౌరీశంకరులకు లక్ష బిల్వార్చన

బిక్కవోలు: కార్తికమాసం సందర్భంగా పందలపాక గ్రామంలో కొలువైన గౌరీశంకరులకు లక్ష బిల్వార్చన కార్యక్రమం నిర్వహించారు. సోమవారం అర్చకులు గరిమెళ్ల గాంధీ ఆధ్వర్యంలో అర్చక బృందంతో గణపతి పూజ, రుద్రాభిషేకం, కుంకుమ పూజలు, లక్ష బిల్వార్చన తదితర కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం అన్నసమారధన చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బండారు గణేష్, బోడ్డు ఆనంద్, వెన్నాల శివ, గేదల గణేష్ తదితరులు పాల్గొన్నారు. పార్వతీ సమేత ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద అర్చకులు గరిమెళ్ల సత్య ప్రకాష్ ఆధ్వర్యంలోను, కొంకుదురు బుడత మామిడి వద్ద శ్రీ బాలా త్రిపుర సుందరీ సమేత త్రిముఖలింగేశ్వరస్వామి ఆలయం వద్ద అర్చకులు రమణశర్మ ఆధ్వర్యంలోను లక్ష బిల్వార్చన పూజలు నిర్వహించారు.

రాజరాజేశ్వరస్వామికి లక్షపత్రి పూజ

రంగంపేట: మండల పరిధిలోని పెదరాయవరం గ్రామంలో కొలువైన రాజరాజేశ్వరస్వామి ఆలయంలో గ్రామస్తులు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో లక్షపత్రి పూజ ఘనంగా నిర్వహించారు. ముందుగా గణపతి పూజతో ప్రారంభించి అనంతరం 11 రకాల ద్రవ్యాలతో చంద్రశేఖరస్వామికి అభిషేకాలు, పత్రిపూజ చేపట్టారు. కాత్యాయనీదేవికి లలితా సహస్రనామాలతో కుంకుమార్చన, నీరాజన మంత్రపుష్పం, చతుర్వేదస్వస్తిని ఆలయ అర్చకులు మునుకుట్ల శివరామకృష్ణ ఆధ్వర్యంలో ఋత్విక్కులు నిర్వహించారు. కార్యక్రమంలో అధికసంఖ్యలో మహిళలు, గ్రామస్తులు హాజరయ్యారు.

రామలింగేశ్వరస్వామి సన్నిధిలో మాజీ ఎమ్మెల్యే

పెదపూడి: అనపర్తి పాతఊరులో కొలువైన ఉమా రామలింగేశ్వరస్వామిని మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు సోమవారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం పండితుల చేత ఆశీర్వచనాలు పొందారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పొతంశెట్టి శ్రీనివాసారెడ్డి, వల్లూరి భార్గవ్రామ్, ఎంపీటీసీ సభ్యుడు కొండేటి భీమేష్, వైఎస్సార్సీపీ నాయకులు సునీల్రెడ్డి, రైస్ మిల్లర్ రమేష్రెడ్డి, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

పలు సమస్యలపై అర్జీల అందజేత

సీతానగరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీడీవో ఎం.భారతి, తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు పలువురు అర్జీలు అందించారు. మండలంలో అనుమతి లేకుండా ఇటుక బట్టీలు నిర్వహిస్తున్నారని, వాటిని తక్షణమే మూసివేయాలని కోరుతూ చినకొండేపూడికి చెందిన అడ్వకేట్ చిడిపి నకులు సురేష్ అర్జీ అందించారు. కోరుకొండ చర్చిలో తనకు వివాహం అయిందని, కానీ వివాహ పత్రాన్ని చర్చి పాస్టర్ ఇవ్వడం లేదని ముగ్గళ్లకు చెందిన బేదంపూడి వీర్రాజు అర్జీ పెట్టుకున్నారు. వృద్ధాప్యంలో ఉన్న తనను కుమారుడు పట్టించుకోవడం లేదని, అతడికి ఇప్పటికే స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేశానని, దాన్ని రద్దు చేయాలని కోరుతూ సీతానగరం పంచాయతీ పరిధిలోని లంకూరుకు చెందిన మట్ట నరసింహమూర్తి ఫిర్యాదు చేశారు. ఇండియన్ పెట్రోల్ బంక్పై నుంచి 11 కేవీ విద్యుత్ లైన్ వెళ్లిందని, దాన్ని అక్కడ నుంచి తొలగించాలని చిన కొండేపూడికి చెందిన వీవీఎస్ రెడ్డి అధికారులకు అర్జీ పెట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో వివిధశాఖ అధికారులు, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వనసమారాధనలతో ఐక్యతకు నాంది




పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి దంపతులు

పెదపూడి: కార్తిక వనసమారాధనలు ఐక్యతకు దోహదం చేస్తాయని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. అనపర్తి మండలం పాలమూరు గ్రామంలో కార్తిక వన సమారాధన సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి దంపతులు హాజరయ్యారు. ముందుగా ఉసిరిచెట్టు వద్ద దామోదర పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు సత్తి గీత వరలక్ష్మి, ఉప సర్పంచి సత్తి సూరారెడ్డి, సర్పంచ్ గుడాల ధన లక్ష్మి, మాజీ సర్పంచ్ గుడాల రామ్కుమార్, సత్తి అమ్మిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

పెదపూడిలో వాల్ పోస్టర్ కలకలం

వెలుగు ఏపీఎంపై ఆరోపణలు చేస్తూ రెండోసారి ప్రదర్శన



పెదపూడి వెలుగు కార్యాలయం శిలాఫలకంపై అతికించిన వాల్పోస్టర్

పెదపూడి: పెదపూడిలో సోమవారం వెలుగు కార్యాలయం ఇన్చార్జ్ ఏపీఎం చినబాబుపై పలు ఆరోపణలు చేస్తూ రెండోసారి అంటించిన వాల్పోస్టర్ కలకలం రేపింది. కార్యాలయం ప్రధాన ద్వారం వద్ద గల శిలాఫలకంపై చినబాబుపై పలు ఆరోపణలు చేస్తూ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డికి విన్నవిస్తూ వాల్పోస్టర్ను గుర్తు తెలియని వ్యక్తులు అంటించారు. ఉదయం సమయంలో ఈ వాల్పోస్టర్ను గుర్తించిన సిబ్బంది దానిని తొలగించి దానిపై తెల్లపేపరును అంటించారు. డ్వాక్రా గ్రూపు సభ్యులకు స్త్రీనిధి రుణం రూ.5 లక్షల వరకు మంజూరు చేస్తూ దానిలో రుణం ఇప్పిచ్చినందుకుగాను సుమారు రూ.15నుంచి 20వేల వరకు మాముళ్లు వసూలు చేస్తున్నారంటూ వాల్పోస్టర్లో ఆరోపించారు. 2021 నుంచి ఒక్కో గ్రూపునకు సభ్యత్వ రుసుం అంటూ రూ.2500 అక్రమంగా వసూలు చేస్తున్నారని ఆ సభ్యత్వ రుసుం నిధులు ఏమవుతున్నాయో ఎవరికి తెలియదని ఆరోపించారు. మొదటిసారిగా సెప్టెంబర్ 22న కరకుదురు గ్రామ పంచాయతీ కార్యాయలం వద్ద చినబాబుపై పలు ఆరోపణలు చేస్తూ అప్పట్లో వాల్పోస్టర్ను అంటించారు. దీనిపై ఏపీఎం చినబాబును వివరణ కోరగా తనపై వచ్చిన ఆరోపణలు అవాస్తవమని ఎవరో దురుద్దేశ్యపూర్వకంగా తనపై ఇటువంటి అకృత్యాలకు పాల్పడుతున్నారని వాపోయారు.

29, 30 తేదీల్లో ఐడీఈ బూట్ క్యాంప్

రాజానగరం: గోదావరి గ్లోబెల్ యూనివర్సిటీ (జీజీయూ)లో ఈ నెల 29, 30 తేదీల్లో ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ) ఆధ్వర్యంలో ఇన్నోవేషన్, డిజైన్ అండ్ ఎంటర్ప్రెన్యూర్షిప్ (ఐడీఈ) బూట్ క్యాంప్ జరగనుంది. ఈ కార్యక్రమ నిర్వహణలో ఆంధ్రప్రదేశ్లో జీజీయూని మోడల్ సెంటర్గా గుర్తించారని వీసీ డాక్టర్ యు.చంద్రశేఖర్ తెలిపారు. ఉపాధ్యాయులకు ఇన్నోవేషన్, ఇంక్యూబేషన్, ఎంటర్ప్రెన్యూర్షిప్ సంబంధిత అంశాలలో మౌలిక శిక్షణ, అవగాహన కలిగించే విధంగా ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. దీనికి ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, ఛత్తీస్గఢ్, ఒడిశా రాష్ట్రాల నుంచి 200 మంది ఉపాధ్యాయులు హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమ నిర్వహణకు అసోసియేట్ ప్రొఫెసర్లు డి.విజయేంద్ర కుమార్, కె.వినోద్వర్మలను నోడల్ అధికారులుగా నియమించారు.

మెగా పేరెంట్స్ మీటింగ్కు ఏర్పాట్లు చేయాలి



ఫ్లాగ్ డే పోస్టర్ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న మెగా పేరెంట్ మీటింగ్కు అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ప్రశాంతి విద్యాశాఖాధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన సమీక్షలో పలు అంశాలపై చర్చించారు. ప్రధానోపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేసి మెగా పేరెంట్, టీచర్ మీటింగ్ అంశాలను వివరించాలన్నారు, తల్లిదండ్రులకు వార్డు పెద్దలకు ఆహ్వాన పత్రాలను ముందుగానే పంపించాలన్నారు. పూర్తి పండుగ వాతావరణంలో అన్ని పాఠశాలలలోనూ నిర్వహించాలన్నారు. ఇప్పటి వరకు జరిగిన రెండు సెల్ఫ్ అసెస్మెంట్ మోడల్ పేపర్ 1, 2 పరీక్షల మార్కులు ఆన్లైన్లో నూరుశాతం నమోదు కావాలన్నారు. జిల్లా పాఠశాల విద్యాశాఖ అధికారి కె.వాసుదేవరావు, ఏడీ వెంకట్రాజు తదితరులు పాల్గొన్నారు.

ఫ్లాగ్ డే పోస్టర్ ఆవిష్కరణ

సాయుధ దళాల పతాక దినోత్సవ (ఫ్లాగ్ డే) పోస్టర్ను కలెక్టర్ పి.ప్రశాంతి, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్న రాముడు, జిల్లా సైనిక సంక్షేమ అధికారి కెప్టెన్ డా.సత్యప్రసాద్ సోమవారం సాయంత్రం కలెక్టర్ చాంబర్లో ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఏటా డిసెంబర్ ఏడున సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామన్నారు. దేశ రక్షణ కోసం సాయుధ దళాలు అహర్నిశలు కృషి చేస్తాయన్నారు. వారి సంక్షేమానికి విరాళాలు అందించి దేశభక్తిని చాటాలని కోరారు. విరాళాలు అందించేవారు జిల్లా సైనిక్ సంక్షేమ కార్యాలయం వారి పేరు మీద స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, జిల్లా పరిషత్ శాఖ, కాకినాడ బ్రాంచ్లోని ఖాతా 62064060623 ఐఎఫ్ఎస్సి కోడ్ ఎస్బీఐఎన్ 0020974 నేరుగా జమ చేయవచ్చునని జిల్లా సైనిక సంక్షేమ అధికారి కెప్టెన్ సత్యప్రసాద్ తెలిపారు.

ట్రై సైకిల్ వితరణ

సీటీఆర్ఐ: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో దరఖాస్తు చేసిన వెంటనే విభిన్న ప్రతిభావంతురాలైన నాగులపల్లి ఆదిలక్ష్మికి ట్రై సైకిల్ అందజేసినట్టు కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. సోమవారం జరిగిన పీజీఆర్ఎస్లో 45వ డివిజన్కు చెందిన ఆదిలక్ష్మికి రూ.8,500 విలువైన ట్రై సైకిల్ అందజేశారు.


దోష రహిత ఓటరు జాబితా రూపొందించాలి



సమీక్షలో మాట్లాడుతున్న ఓటరు జాబితా అబ్జర్వర్ నాయక్, చిత్రంలో కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం రూరల్: ఓటరు జాబితాను దోష రహితంగా రూపొందించడానికి సంబంధిత అధికారులు దృష్టి సారించాలని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ కార్యదర్శి, ఓటర్ల జాబితా అబ్జర్వర్ ఎంఎం నాయక్ అన్నారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో కలెక్టర్ పి.ప్రశాంతితో కలిసి సోమవారం సాయంత్రం ఎస్ఎస్ఆర్ 2025 ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణపై ఈఆర్ఓలు, నోడల్ అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా నాయక్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు ఓటర్ల జాబితా ఎంతో కీలకమన్నారు. ముఖ్యంగా డిగ్రీ కళాశాల విద్యార్థులను నూతన ఓటర్లుగా చేర్పించాలని సూచించారు. జాబితాలోని లాజికల్, డెమోగ్రాఫికల్ పొరపాట్లు ఉంటే వాటిని పూర్తిస్థాయిలో సవరించాలన్నారు. కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ జిల్లాలో 2025 ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆయా అంశాలను వివరించారు.

అన్న సమారాధన



అన్న ప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

రాజానగరం: కార్తిక సోమవారం సందర్భంగా స్థానిక రాజలింగేశ్వరస్వామి, రాజగోపాలస్వామి, రాజరాజేశ్వరి అమ్మవార్ల ఆలయ ప్రాంగణంలో సోమవారం అన్న సమారాధనకు నిర్వహించారు. రాజానగరంతో పాటు పరిసర గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఫరిజెల్లిపేటకు చెందిన యడవల్లి సూర్యచక్రం, దుర్గమ్మ దంపతుల ఆధ్వర్యంలో అన్న సమారాధన జరిగింది.